విశాలాంధ్ర
శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా

ముఖ్యమంత్రి పర్యటనకు సర్వం సిద్ధం

- చారిత్రాత్మక ఘట్టానికి కావలి వేదిక కావడం అదృష్టం
- రాష్ట్ర రైతాంగానికి నేడు పండుగ రోజు
- దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న చుక్కల భూముల సమస్యకు నేటితో విముక్తి
- సీఎంకు ఘన స్వాగతం పలికేందుకు కావలి ముస్తాబు
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి

విశాలాంధ్ర - కావలి: ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి కావలి పర్యటనకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, హెలిపాడ్, బహిరంగ సభ వేదిక వద్ద ఎటువంటి లోటుపాట్లు లేకుండా సర్వం సిద్ధం చేశామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన రెడ్డి వెల్లడించారు. గురువారం సాయంత్రం కావలిలో సీఎం పాల్గొనే బహిరంగ సభ వేదిక వద్ద ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి,సీఎం ప్రోగ్రాంకోఆర్డినేటర్ తలసీల రఘురాంతో కలిసి ఏర్పాట్లను మంత్రి పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయని, సీఎంకు ఘన స్వాగతం పలికేందుకు రైతులందరూ ఎదురుచూస్తున్నారన్నారు. రాష్ట్ర రైతాంగానికి నేడు పండుగ రోజు అని, నేటి నుంచి చుక్కల భూముల సమస్య శాశ్వతంగా పరిష్కారం కానుంద న్నారు. జిల్లాలో సుమారు 23 వేల మంది రైతులకు సంబంధించి సుమారు 43270 ఎకరాల భూములను 22ఎ నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించి సంపూర్ణ హక్కులు కల్పిస్తూ ముఖ్యమంత్రి స్వహస్తాలతో రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు అందజేసే చారిత్రాత్మక ఘట్టానికి కావలి పట్టణం వేదిక కావడం మన అదృష్టంగా మంత్రి పేర్కొన్నారు. అసాధారణ నిర్ణయంతో సుదీర్ఘ కాలం గా అపరిష్కృతంగా ఉన్న చుక్కల భూముల సమస్యను పరిష్కరించి, రైతుల పక్షపాతి గా కావలి పట్టణానికి విచ్చేస్తున్న ముఖ్యమంత్రికి స్వాగతం పలికేందుకు కావలి పట్టణం ముస్తాబైందని, రైతాంగానికి అన్ని విధాలా అండగా ఉంటున్న ముఖ్య మంత్రికి రైతులందరూ తమ ఆశీస్సులు అందించాలని మంత్రి ఈ సందర్భంగా ఆకాంక్షించారు. రాష్ట్రంలో అకాల వర్షాలతో దెబ్బతిన్న రైతులను అన్ని విధాల ఆదుకునేందుకు చర్యలు చేపట్టా మన్నారు. రంగు మారిన, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చా మన్నారు. పంట నష్టపోయిన రైతులకు బీమా, ఇన్పుట్ సబ్సిడీ త్వరలోనే అందిస్తా మని, ఏ ఒక్క రైతూ నష్ట పోకుండా ప్రభుత్వ పరంగా అన్ని చర్యలు తీసుకుంటున్నామని మంత్రి ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు.

అదనపు కమిషనర్‌గా ఎస్ షర్మద బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర- నెల్లూరు కార్పొరేషన్: నెల్లూరు నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ గా ఎస్. షర్మద బాధ్యతలు స్వీకరించారు. ఈమేరకు కమిషనర్ వికాస్ మర్మత్ కు జాయినింగ్ రిపోర్టును కార్యాలయంలో గురువారం ఆమె అందజేశారు.

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

విశాలాంధ్ర - కావలి : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిశుక్రవారం కావలిలో పర్యటించ నున్న నేపథ్యంలో గురువారం ఉదయం జిల్లా కలెక్టర్ యం. హరి నారాయణన్, కావలి శాసన సభ్యులు రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి, సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ తలసీల రఘురాంతో కలిసి బహిరంగ సభ ప్రదేశాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించి అధికారు లకు తగు సూచనలు, ఆదేశాలు ఇచ్చారు. సీటింగ్ ఏర్పాట్లు, విఐపి గ్యాలరీలు, పార్కింగ్, భద్రతాపరమైన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పి హిమవతి, నుడా వైస్ ఛైర్మన్ టి. బాపిరెడ్డి, కావలి ఆర్డీవో శీనా నాయక్, ఆర్ అండ్ బి ఎస్ఈ గంగాధర్, డిపిఓ సుస్మిత, తదితర అధికారులు పాల్గొన్నారు.

గడపగడపకు మన ప్రభుత్వంలో నేదురుమల్లి

విశాలాంధ్ర-రాపూరు: రాష్ట్రంలో సంక్షేమ పథకాలను పారదర్శ కంగా అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్మోహన్ రెడ్డికి దక్కు తుందని తిరుపతి జిల్లా వైసిపి అధ్యక్షులు వెంకటగిరి నియోజకవర్గ సమన్వ యకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి అన్నారు. రాపూరు మండలం లోని గిలక పాడు,గండూరు ప ల్లి గ్రామాల్లో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నేదురుమల్లి రాంకు మార్ రెడ్డి,రాపూరు మండల స్థానికులు సుదీర్ఘ రాజకీయ కుటుంబ సభ్యులైన పాపకన్ను దయాకర్ రెడ్డి ప్రతి గడపకు వెళ్లి వారికి అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించి, వారి స మస్యలు తెలుసుకున్నారు. గ్రా మాల అభివృద్ధి, ప్రజల సంక్షేమ మే లక్ష్యంగా పనిచేస్తున్నామ న్నారు. జగనన్నకు చెబుదాం 1902 అనే కార్యక్రమం ద్వారా ప్రజలు తమ సమస్యలను వి న్నవించుకునే కొత్త కార్యక్ర మానికి ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారన్నారు.వచ్చే ఎన్నికల్లో తమ పార్టీని అశ్విర్వదించి జగనన్న ను మళ్లీ సీఎం ను చేయాలని అందుకు ప్రజలంద రూ కలిసి మీ అమూల్యమైన ఓటు వేసి జగనన్నను గెలిపిం చాలని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమములో మండల జెసి ఎస్ ఇంచార్జ్ డి.ఎల్.నారయణ రెడ్డి,అయా గ్రామల సర్పంచ్ లు,అన్ని శాఖల అధికారులు, ఈఆర్ఓలు,సచివాలయఅధి కారులు పంచా యతీ కార్యదర్శుల,నాయకులు, కార్యకర్త లు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో లాటరీ ద్వారా అడ్మిషన్లు: ప్రిన్సిపాల్

విశాలాంధ్ర-రాపూరు: రాపూరులోని ఆంధ్రప్ర దే శ్ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశా లలో లాటరీ విదానం ద్వారా అడ్మిషన్లు తీసుకుంటామని ప్రిన్సిపాల్ క్రిస్టియాన జెమ్స్ తెలిపారు. ఈ సంద ర్భంగా ఆమె తెలియజేస్తూ 2023-24 విద్యా సంవత్సరం కు గాను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న ఏపి టి డబ్లూఆర్ఈఐ సోసైటి గురుకులం వారు 3వ తరగతి , బ్యాక్ లాగ్ ఖాళీలను 4వ తరగతి నుండి 9వ తరగతి వరకు ఆంధ్ర ప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల బాలి కల పాఠ శాల రాపూరులో ఉన్న ఖాళీలను లాటరీ విధా నం ద్వారా అడ్మిషన్ తీసుకోవా లని నిర్ణయించిందన్నారు. 3వ తరగతిలో ఎస్ టి లకు - 31 సీట్లు, ఎస్ సి లకు -05 సీట్లు, బిసి ల కు-02 సీట్లు, ఓసి లకు 01 సీటు మరియు ఎఈక్యూ నం దు 01 సీటు చొప్పున 40 సీట్లు ఖాళీగా ఉన్నవి. 4వ తరగతిలో 36,5వ తరగతిలో 33 సీట్లు, 6వ తరగతిలో 33 సీట్లు, 7వ తరగతిలో 04 సీట్లు, 8వ తరగతిలో 08 సీట్లు, 9వ తరగతిలో 15 సీట్లను కేవలం ఎస్‌టి విద్యార్థినులతో మాత్రమే నింపుతామని పాఠశాల ప్రిన్సిపాల్ క్రిష్టియనా జేమ్స్ తెలిపారు. పాఠశాల అడ్రస్ కొత్తపేట, రాజంపేట రోడ్డు, రాపూరులో దరఖాస్తులను తీసుకోవాలని, దరఖాస్తు చేసుకు నేందుకు ఈ నెల 30వ తేదీ ఆఖరు అని ప్రిన్స్ పాల్ తెలిపారు.

శరవేగంగా నెల్లూరు రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: నెల్లూరు రైల్వే స్టేషన్ భవనం తూర్పు, పడమర వైపుల పునాది, కాంక్రీట్ పనులు పూర్తవుతున్నాయి. అన్ని ప్లాట్ ఫారమ్‌లలో ఎయిర్ కాంకోర్స్ , సిఓపి నిర్మాణ పనులల్లో వేగంగా పురోగతి దక్షిణ మధ్య రైల్వే ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైల్వే స్టేషన్ల మేజర్ అప్‌గ్రేడే షన్" కిందసుందరమైన ఫీచర్ల తో ప్రపంచ స్థాయి సౌకర్యాలను కల్పిం చేం దుకు గాను నెల్లూరు స్టేషన్ పునరా భివృద్ధి అనే ప్రాజెక్ట్ ను చేపట్టింది. ఈ స్టేషన్ గ్రాండ్ ట్రంక్ మార్గం లో ఉంది. ఇది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ముఖ్యమైన స్టేషన్లలో ఒక టి. స్టేషన్ పునరా భివృద్ధి పనులు ఈపిసి విధానంలో మెస్సర్స్ ఎస్‌సి ఎల్ ఇన్‌ఫ్రాటెక్ లిమిటెడ్, హైదరాబాద్ సంస్థకు అప్పగిం చింది. ఈ పనులను మే, 2024 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు కాంట్రాక్టు ఇచ్చిన నాటి నుంచి స్టేషన్ పునరద్ధరణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ప్రాథమికంగా సైట్ కార్యాల యాలు, కాంక్రీట్ టెస్టింగ్ ల్యాబ్, మెటీరియల్ పేర్చేందుకు స్టోరేజీ షెడ్‌ల ఏర్పాటు ఇప్పటికే పూర్త య్యాయి. కొత్త స్టేషన్ బిల్డింగ్ డిజైన్‌ను ఐఐటీ-మద్రాస్ ధ్రువీకరించారు. రైల్వే కోర్టు, జీఆర్పీ కార్యాలయాలకు తాత్కాలిక షెడ్లు నిర్మించి సంబంధిత శాఖలకు అప్పగించారు. కొత్త రీడెవలప్ చేయబడిన స్టేషన్ భవనం అన్ని ప్లాట్‌ఫారమ్‌లలో కవర్ ఓవర్ ప్లాట్‌ఫారమ్‌లను (సి ఓ పి) కల్గి ఉంటుంది. ఇందుకు సంబంధించి పీఎఫ్ నంబర్ 1 నుంచి 4 వరకు 44 నంబర్ల సీఓపీ పీడీల నిర్మాణం పూర్తికాగా, మరో 16 నంబర్ల పనులు పురోగతిలో ఉంది. అదే విదంగా 1 నుండి 4 ప్లాట్ ఫారమ్‌లలో 29 సంఖ్యల సిఓపి స్టాంచ్‌లు కూడా పూర్తయ్యాయి. పున రాభివృద్ధి చేయ బడిన స్టేషన్ లో నీటి అవసరాలను తీర్చడానికి, 6 లక్షల లీటర్ల నీటి సామర్థ్యంతో ఒక గ్రౌండ్ లెవల్ రిజర్వాయర్ ను నిర్మించేందుకు ప్రణాళిక రూపొందించారు.దీని నిర్మా ణం కోసం తవ్వకం పని, పునాదుల పనులు పూర్తయింది. భవిష్యత్ ప్రయాణికుల అవసరాలను తీర్చ దానికి, తూర్పు పడమర రెండు వైపులా ఉన్న భవనాలకు అదనపు మార్పులు చే స్తు న్నారు. దీనికి సంబంధించి, తూర్పు వైపు స్టేషన్ భవనం పశ్చిమ వైపు భవనం పునాదుల కోసం తవ్వకం పనులు పూర్తయ్యాయి. పునరాభివృద్ధి స్టేషన్ లో అన్ని ప్లాట్‌ఫారమ్‌లను కలుపుతూ విశాలమైన ఎయిర్‌కోర్సు ఉంటుంది. దీన్ని నిర్మించడం కోసం, ప్లాట్ ఫారం-4 , ప్లాట్ ఫారం-1 రెండింటిలో అంటే తూర్పు పడమర వైపులా ఎయిర్ కాన్కోర్స్ కోసం పునాదుల తవ్వకం పూర్తయింది.ఈ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ మాట్లాడుతూ నెల్లూరు స్టేషన్‌లో ప్రారంభమైన అప్‌గ్రేడేషన్ పనులు శరవేగంగా జరుగు తున్నాయని, షెడ్యూల్ ప్రకారం పనులు పూర్తవుతున్నాయని తెలిపారు. అప్‌గ్రేడేషన్ పనులు రైలు వినియోగదారులకు అంతరాయం లేని అనుభవాన్ని అందించడానికి, ఆధునిక సౌకర్యాలతో స్టేషన్‌కు సౌందర్య రూపాన్ని ఇస్తాయని ఆయన పేర్కొన్నారు.

మీ ఎమ్మెల్యే చేసే అవినీతి బయట పెట్టగలరా?

- ముఖ్యమంత్రికి సవాల్ విసిరిన మాలేపాటి

విశాలాంధ్ర - కావలి: నియోజకవర్గంలో మీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి చేసే అవినీతిని బయట పెట్ట గలరా? అని కావలి కి విచ్చే స్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి కి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి మాలేపాటి సుబ్బానా యుడు సవాల్ విసిరారు. గురువారం కావలి రూరల్ మండలం రుద్రకోట పంచా యతీలో సుబ్బానాయుడు ఆధ్వ ర్యం లో కావలి పట్టణ, రూరల్ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఇదేం కర్మ రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి తిరుగుతూ, తెలుగుదేశం పార్టీ కరపత్రాలు పంచుతూ, అక్కడి ప్రజల సమస్యలను ఆయన తెలుసుకున్నారు. వైసీపీ ప్రభుత్వంలో జరుగుతున్న అన్యా యాలపై అక్కడి ప్రజలు సుబ్బానాయుడు కు విన్నవిం చుకున్నారు. భర్త మరణించి 10 సంవత్సరాలు అయినా ఇప్పటికీ పెన్షన్ రావటం లేదని అక్కడి మహిళ వాపోయారు. అక్కడి స్థానికులు వైసిపి నాయకుల బెదిరింపులకు భయాందోళనలకు గురై ఉన్నారని టిడిపి శ్రేణులు అర్థం చేసుకున్నారు. వారందరికీ సుబ్బానాయుడు ధైర్యం చెబుతూ త్వరలోనే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రానుందని మీ కష్టాలను తీర్చే సమయం ఆసన్నమైందని ధైర్యం చెప్పారు. రుద్రకోట హైవే దగ్గరలోని క్వారీలో జరుగుతున్న అక్రమ గ్రావెల్ తరలింపులను స్థానికులు ఆయన దృష్టికి తీసుకు వచ్చారని హుటా హుటిన తెలుగుదేశం పార్టీ శ్రేణులతో కలిసి అక్కడికి వెళ్లి చూడగానే అందరూ విస్తు పోయేలా గ్రావెల్ మాఫియా సాగుతుందని పత్రిక విలేకరుల సమక్షంలో సుబ్బానాయుడు గారు తెలియజేశారు. టిడిపి శ్రేణులు సైకో పోవాలి - సైకిల్ రావాలి, సీఎం డౌన్ డౌన్, గ్రావెల్ మాఫియాలోని నేతలను అరెస్టు చేయాలి అంటూ నినాదాలు చేశారు. స్పందించిన సుబ్బానాయుడు మాట్లాడుతూ ఇంతటి అవినీతికి పాల్పడుతున్న నేతలకు సిగ్గుందా? అని ప్రశ్నించారు. నెల్లూరు జిల్లాలో మైనింగ్ డిపార్ట్మెంట్ ఉందా? లేదా? అని అనుమానం వస్తుందని, అసలు ఈ గ్రావెల్ తరలింపుకి సీనరైస్ ఎంత కట్టారని అడిగారు. ఒకవేళ పర్మిషన్ తీసుకొని ఉన్నా 5 అడుగుల మించి లోతుకు గ్రావెల్ తీయకూడదని నిబంధనలు ఉన్నాయని, వాటిని అతిక్రమించి వంద అడుగుల వరకు గ్రావెల్ ఎలా తొవ్వుతున్నారో అర్థం కావడం లేదన్నారు. శుక్రవారం సీఎం జగన్ కావలి పర్యటన సందర్భంగా ముఖ్యమంత్రి కి ఒకటే విన్నవించుకుంటున్నామని, ఈ గ్రావెల్ మాఫియా నిందితులను బయట పెట్టి ముఖ్యమంత్రి తన సత్తా నిరుపించు కోవాలన్నారు.

పలు కార్యక్రమాల్లో మాలేపాటి

విశాలాంధ్ర - కావలి : పట్టణ 10వ వార్డుకు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు పిట్టు మురళి అనారోగ్యంతో అకాల మరణం చెందారు. విషయం తెలుసుకున్న కావలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు గురువారం మురళి భౌతికకాయాన్ని దర్శించి పూలమాలలు వేసి సంతాపం తెలియజేశారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం కావలి పట్టణ 20వ వార్డకు చెందిన మాజీ కౌన్సిలర్ పాలడుగు అనురాధ భర్త పాలడుగు మురళి అమ్మఇటీవల స్వర్గస్తులైనారు. ఆమె ఉత్తర క్రియల కార్యక్రమంలో పాల్గొన్న సుబ్బానాయుడు చిత్రపటానికి పూలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కావలి పట్టణ ముసునూరుకు చెందిన ఒంగోలు శ్రీనివాసులు ఉత్తర క్రియల కార్యక్రమంలో పాల్గొని చిత్రపటానికి పూలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కావలి పట్టణ ముసునూరు తెలుగుదేశం పార్టీ నాయకులు గొట్టిపాటి కొండపనాయుడు తల్లి ఇటీవల స్వర్గస్తులైనారు. వారి కుటుంబ సభ్యులను సుబ్బానాయుడు కలిసి పరామర్శించారు. అనంతరం కావలి పట్టణ 8వ వార్డుకు చెందిన కొత్త రమేష్ ఇటీవల స్వర్గస్తులైనారు. వారి కుటుంబ సభ్యులను సుబ్బానాయుడు కలిసి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ కార్యదర్శి మొగిలి కల్లయ్య, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు మన్నవ రవిచంద్ర, రాష్ట్ర ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి ఆత్మకూరి నాగరాజు, రాష్ట్ర మైనారిటీ విభాగం కార్యనిర్వాహ కార్యదర్శి మస్తాన్, ముఖ్య నాయకులు కిరణ్, మేడికొండ సుకుమార్, పార్టీ ముఖ్య నాయకులు మంచాల ప్రసాద్, కావేటి శివకుమార్, లింగం మాల్యాద్రి, సింగమనేని హరిబాబు, స్వర్ణ మహేష్, ఖాదర్ భాష, రవి, బోయిన శ్రీనివాసులు, పోతుగంటి శ్రీకాంత్, పట్టణ మైనారిటీ విభాగం అధ్యక్షులు సయ్యద్ అబ్దుల్ రహీం, బొగ్గవరపు సత్య, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయం తనిఖీ

విశాలాంధ్ర -ఉదయగిరి: పట్టణంలోని బిట్ 1 2 3 సచివాలయాలను స్థానిక ఎంపీడీవో పి ఐజాక్ ప్రవీణ్ గురువారం తనిఖీ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది 100 శాతం బయోమెట్రిక్ హాజరు తప్పక నమోదు చేయాలని సూచించారు. ఉదయం 10.30 లోపు కార్యాలయానికి విధులు నిర్వహిం చేందుకు హాజరు కావా లన్నారు. ప్రజలకు అందులో ఉండి వారి సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలి అన్నారు ప్రభుత్వం సూచించిన సర్వేలు 100 శాతం పూర్తి చేయాలన్నారు . విధి నిర్వహణలో నిర్లక్ష్యం వస్తే కఠి న చర్యలు తీసు కుంటామని చేయించారు. జగనన్న గ్రహాలను త్వరిత గతిన పూర్తిచేసేలా వాలంటీర్లు లబ్దిదారులకు అవగాహన అవగాహన కల్పిం చాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ గ్రామ కార్యదర్శి ఖాదర్ కరీముల్లా ప్రసన్న మండల కోఆర్డినేటర్ షేక్ రాజుల ఇమ్రాన్ ఇమ్రాన్ సచివాలయ సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు.

వైసిపి నాయకులపై బిజేపీ ఫిర్యాదు

విశాలాంధ్ర- రాపూరు: రాపూరు లో బిజేపీ వెంకటగిరి నియోజ కవర్గ ఇంచార్జీ ఎస్ఎస్ఎస్ఆర్ నాయుడు అధ్యక్షతన,మండల బిజెపి అధ్యక్ష,కార్యదర్శి లు, దూడ ల పెంచలయ్య, తిక్కమ నెని వెంకటరత్నం ఆధ్వర్యంలో బుధవారం జరిగిన సమా వేశంలో 2019 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో వైసిపి నాయకులు చేసిన వాగ్దానాలను నెరవేర్చకుండా మండల ప్రజలను మోసం చేశారని రాపూరు పోలీస్ స్టేషన్లో వారి పై చార్జిషీట్ దాఖలు చేయాలని వినతి పత్రం అందించామని ఎస్ఎస్ఆర్ నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా నాయుడు మాట్లాడుతూ పంగిలి గ్రామంలో సర్వే నెంబర్1లో 2వేలఎకరాలు పేదవారికి ఇస్తామని వాగ్దానంచేసి ఇప్పటికి,ఇవ్వలేదని, బొజ్జన పల్లి పంచాయతీలోని రాయిగుంటపల్లి, పులిగిలపా డు,వీరాయపాళెం గ్రామాల్లోని మెటల్ క్రషర్ వాళ్ళకు కొన్ని ఎకరాలకు అనుమతి తీసుకొని, వందలాది ఎకరాల్లో బోర్లు, బ్లా స్టింగ్ చెసి,వర్షపు నీరు రాకుం డా మైనింగ్ చేస్తు మోసం చెస్తు న్నారని, రాపూరు పట్టణంలో డ్రెనేజ్ వ్యవస్థ మెరుగుపరుస్తా మని ఎలక్షన్ లో హామీ ఇచ్చి నెరవేర్చక డ్రెనేజ్ వ్యవస్థ అస్తవ్య స్తమై దోమలు, పందులు, కుక్కలు విలయతాండవం చేస్తూ ప్రజలను ఇబ్బంది పెడుతున్న నాయకులు పట్టించు కోలేదని, కండలేరు జలాశయ ముంపు గ్రామ ప్రజలకు ఇంటికొక ఉద్యోగం ఇస్తామని, బడుగు,బలహీన వర్గాలకు పొలాలు ఇస్తామని మోసంచేసారని, సోమశిల స్వర్ణ ముఖి లింక్ కెనాల్ పూర్తి చేస్తా మని భూమి ఇచ్చి మోసం చేశారని, రాపూరు పంచాయతీలోని ఎర్రరోడ్డు లోని భూమిని పెదలం దరికి ఇస్తామని మోసం చేశారని, దాఖలు చేసిన చార్జిషీట్ ను పోలీస్టేషన్ లో ఇచ్చారని ఎస్ఎస్ఎస్ఆర్ నాయుడు తెలిపారు.

విద్యార్థుల సమస్యలు పట్టించుకోని ముఖ్యమంత్రి: ఎబివిపి

విశాలాంధ్ర - కావలి: విద్యార్థుల సమస్యలు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కి పట్టడం లేదని, విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ మల్లవరపు అశోక్ రెడ్డి ఆరోపించారు. గురువారం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ కావలి నగర శాఖ ఆధ్వర్యంలో స్థానిక క్రిస్టియన్ పేట లోని ఏబీవీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అశోక్ రెడ్డి మాట్లాడుతూ నేను ఉన్నాను, నేను విన్నాను అని అధికారంలోకి వచ్చిన ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆనాడు ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నప్పుడు ఇదే నెల్లూరు జిల్లాలో ఉన్నటువంటి ఉదయగిరి నియోజకవర్గంలో పాదయాత్ర జరుగుతున్న తరుణంలో ఒక రైతు తన దగ్గరకు వచ్చి తన బిడ్డ చదువుకోవడం కోసం ఫీజు రియంబర్స్మెంట్ సరిగా రాకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నామని బాధపడడంతో మన ప్రభుత్వం అధికారంలోకి వస్తే పూర్తి ఫీజు రియంబర్స్మెంట్ ఇస్తానని చెప్పడం జరిగిందన్నారు. అధికారంలోకి వచ్చిన జగన్ రెడ్డి విద్యా సంవత్సరానికి, ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేసే క్యాలెండర్ కు సంబంధం లేకుండా ఉందని, అదే విధంగా పూర్తిస్థాయిలో విద్యార్థులకి వసతి దీవెన, విద్యాదీవెన అందడం లేదన్నారు. ఈ ముఖ్యమంత్రి మాయ చేస్తున్నాడని 12వ తేదీ కావలికి వస్తున్న ముఖ్యమంత్రి పక్కనే ఉన్న ఉదయగిరి నియోజకవర్గం గుర్తుకు రావడం లేదా? మీరు చెప్పిన మాటలు ఏమయ్యాయి? అని ప్రశ్నించారు. అదేవిధంగా రాష్ట్రంలో ఉన్నటువంటి ప్రభుత్వ వసతి గృహాల్లో ఉంటున్న బడుగు, బలహీన వర్గాల, పేద విద్యార్థుల పరిస్థితి దయనీయంగా మారిందని, ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ బడుగు బలహీన వర్గాల విద్యార్థుల పట్ల చిన్నచూపు చూస్తున్నారు అని అన్నారు. జగన్ రెడ్డి తీరు మారకపోతే విద్యార్థుల నిరసన సెగ తప్పనిసరిగా తగులుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి త్రినాథ్, సహాయ కార్యదర్శి హరీష్, నగర సోషల్ మీడియా కన్వీనర్ వేణు, విద్యార్థి నాయకులు అజిత్ రెడ్డి, నందిర్, తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తను విడివిడిగా అందించి సహకరించండి: కమిషనర్

విశాలాంధ్ర- నెల్లూరు కార్పొరేషన్: క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యాచరణలో భాగంగా నెల్లూరు నగర పాలక సంస్థ ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తున్న డోర్ టు డోర్ చెత్త సేకరణలో తడి, పొడి చెత్తను విడివిడిగా అందించి సహకరించాలని కమిషనర్ కమిషనర్ వికాస్ మర్మత్ కోరారు. స్థానిక 36 వ డివిజను ఫతేఖాన్ పేట రైతు బజార్ శానిటేషన్ మస్టర్ పాయింట్ ను కమిషనర్ గురువారం ఉదయం 6.20 గంటలకు తనిఖీ చేశారు. డివిజన్ పరిధిలోని శాంతి నగర్, పోలీస్ క్వార్టర్స్, మూలాపేట తదితర ప్రాంతాల్లో పర్యటించి శానిటేషన్ సిబ్బంది హాజరును కమిషనర్ పరిశీలించారు. పారిశుద్ధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణలో భాగంగా డివిజనుల్లో జరుగుతున్న చెత్త సేకరణ పనులను కమిషనర్ పర్యవేక్షించారు. స్థానిక మూలాపేట స్వర్ణాల చెరువు గణేష్ ఘాట్ ప్రాంతాన్ని పరిశీలించిన కమిషనర్ ఘాట్ ప్రాంగణం పరిశుభ్రతను మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం స్థానిక ప్రజలతో కమిషనర్ ప్రత్యక్షంగా మాట్లాడుతూ చెత్త సేకరణ యూజర్ చార్జీలను ప్రతిఒక్కరూ బాధ్యతగా చెల్లించాలని కోరారు. తడి, పొడి చెత్తను విడివిడిగా చెత్త సేకరణ వాహనాలకు అందించాలని సూచించారు. చెత్త సేకరణ వాహనాలకు మాత్రమే గృహ వ్యర్థాలను అందించాలని, బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేస్తే జరిమానాలు విధిస్తామని, చెత్తను రీసైక్లింగ్ ప్రక్రియ ద్వారా సేంద్రీయ ఎరువులుగా మార్చి తిరిగి వినియోగంలోకి తీసుకురాగలమని కమిషనర్ ప్రజలకు వివరించారు. వాహనాలకు కాకుండా బహిరంగ ప్రదేశాల్లో, డ్రైను కాలువల్లో చెత్తను వేయడం వలన దోమల వ్యాప్తి పెరిగి అనారోగ్యాలు కలుగుతాయని కమిషనర్ పేర్కొన్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేయరాదని అవగాహన కల్పిస్తూ సచివాలయాల పరిధిలోని ప్రతీ ఇంటికి నోటీసులు అందించాలని కార్యదర్శులను కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకట రమణ, సూపర్వైజర్లు, సచివాలయం శానిటేషన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

అవినీతి ప్రభుత్వంపై చార్జి షీటు దాఖలు చేస్తాం..: బిజేపీ

విశాలాంధ్ర - కావలి: వైసిపి ప్రభుత్వ అరాచక, అవినీతి, అక్రమాలపై చార్జి షీటు దాఖలు చేసే ప్రక్రియను ప్రారంభిస్తున్నామని బిజెపి కావలి పట్టణ అధ్యక్షుడు కుట్టు బోయిన బ్రహ్మానందం తెలిపారు. గురువారం కావలి పట్టణంలోని హొటల్ నమస్కార్ కాన్ఫరెన్స్ హాల్ నందు ఏర్పాటు చేసిన పట్టణస్థాయి సమీక్ష సమావేశం నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మానందం మాట్లా డుతూ రివర్స్ టెండర్లతో వైసిపి ప్రభుత్వం పాలన ప్రారంభించి దాడులు, దందాలు, భూకబ్జాలు చేసి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేశారన్నారు. ఎన్నికలకు ముందు కావలి పట్టణాన్ని అభివృద్ధి చేస్తామని ఎన్నో వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చాక వాటన్నిటిని మరిచిపోయి దోపిడీనే పరమావధిగా చేసి పాలన సాగిస్తున్నారని అన్నారు. కావలి పట్టణంలో జరిగిన అవినీతి, అక్రమా లపై ఛార్జ్ షీట్ కార్యక్రమంలో భాగంగా ప్రజల వద్ద నుండి అభియోగ పత్రాలు స్వీకరిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యదర్శి అంచపాకు కమల మాట్లాడుతూ కావలి పట్టణంలో అరాచకం, అక్ర మాలు, భూకబ్జాలు, గ్రావెల్ మాఫియా, ఇసుక మాఫి యా, మద్యం మాఫియా, రియల్ ఎస్టేట్ దందా, అసైన్డ్ భూములు, ప్రభుత్వ భూములు కబ్జా ఇలా అనేక అక్రమాలకు నిలయంగా మారిందని తెలిపారు. వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత జగనన్న లేఔట్ల కు భూ సేకరణలో అవకతవకలు జరిగాయని, అక్రమ కేసులు పెట్టారన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన గృహాలకు సంబంధించి మౌలిక సదుపాయాల కల్పనలో వైఫల్యం చెందారని, ఉపాధి కల్పనలో వైఫల్యం, శాంతి భద్రతల వైఫల్యం జరిగిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ లపై, మహిళలపై దాడులు, కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధుల దుర్వినియోగం, తదితర అన్ని రకాల అక్రమాలపై ప్రజల నుండి అభియోగ పత్రాలు స్వీకరించి చార్జ్ షీట్ దాఖలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు పరుసు వెంకటేశ్వ ర్లు, మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు పద్మావతి శ్రీదేవి, మహిళా మోర్చా పట్టణ అధ్యక్షుడు కామినేని ఉదయలక్ష్మి, కిసాన్ మోర్చా పట్టణ అధ్యక్షులు తూమాటి తిరుపతి స్వామి, ఎస్సీ మోర్చా పట్టణ అధ్యక్షులు జలదంకి విజయ్ కుమార్, బీజేవైఎం ప్రధాన కార్యదర్శి అక్కిల గుంట జీవా, మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి జలదంకి విజయ కుమారి, మంద కోటేశ్వరరావు, మంగమూరు వెంకటరెడ్డి, రాజగోపాల్, పసుపులేటి సుధాకర్, పాల్గొన్నారు.

కారు ఢీ- ఉపాధి కూలి మృతి

విశాలాంధ్ర-రాపూరు:రాపూరు మండల పరిధిలోని పంగిలి బిసి కాలనీకి చెందిన మల్లి అంకమ్మ (37) ఉపాధి హామీ పనికి పోయి పని ముగించుకుని వస్తుండగా కారు ఢీకొన్న ప్రమాదంలో మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. రాపూరు నుండి రాజం పేట మార్గంలోని రాపూరు కి రెండు కిలో మీటర్ల దూరం లోని పంగిలి ఫారెస్ట్ చెక్ పోస్ట్ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. రాపూరు ఎస్ఐ క్రాంతికుమార్ కథనం మేరకు ఉపాధి పనికి వెళ్లి తిరిగి వచ్చే సమయంలో మద్దూరుపల్లి అటవీ చెక్ పోస్ట్ పై భాగాన జాతీయ రహదారి మార్జిను దాటి 5 మీటర్లు వెళ్లిన అంకమ్మను చిట్వేలు నుంచి అమిత వేగంతో వచ్చిన ఏపి 26ఏ యు5699 నెంబర్ గల కారు ఢీ కొట్టడంతో ఆమె తీవ్రంగా గాయపడి మృతి చెందింది. వైద్యం నిమిత్తం రాపూరు వైద్యశాల కు తరలించగా మృతి చెందిందని కారు తోపాటు డ్రైవర్ ను అదుపులోకి తీసుకున్నారని మృతురాలు అంకమ్మకు భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని రాపూరు ఎస్ఐ క్రాంతి కుమార్ తెలిపారు.

పోలినేనిపాలెంలో వీధిలైట్లకు మరమ్మతులు

విశాలాంధ్ర- పలేటివారిపాలెం : మండలంలోని పోలినేనిపాలెం గ్రామంలో మరమ్మ తులకు గురైన వీధి లైట్లును గుర్తించి మరమ్మతులు చేయించినట్లు గ్రామ సర్పంచ్ అను మోలు అమరేశ్వ రి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల ఉరుములతో కూడిన వర్షాలకు వీధి లైట్లు మరమ్మతులకు గురి అయ్యా యాన్ని తెలిపారు. గ్రామస్థులు రాత్రి సమయాలలో రాక పోకలు చేయాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తమ దృష్టికి తీసుకుని వచ్చారని చెప్పా రు. వీధిలైట్లకు మరమ్మతులు చేయటంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ చింతపూడి రవీంద్ర, వైసీపీ నాయకులు అనుమోలు సుబ్బారావు, విద్యుత్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో అంకురార్పణ

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: బ్రహ్మోత్సవాల్లో భాగంగా అంకురార్పణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి నెల్లూరు వాస్తవ్యులు కొండ మల్లికార్జున రెడ్డి లక్ష్మి ,వెంకట్ రామ్ వైష్ణవి ఉభయకర్తలు గా వ్యవహరించారు. గణపతి పూజ స్వస్తి పుణ్యాహావచనం త్రిశూలేశ్వర పూజ, రక్షా బంధన పూజ, ఆచార్యది రుత్విగ్వరుణం, దీక్షా స్వీకారం, యమునా పూజ, మృత్సంగ్రహణం, నవపాలికలయందు చతుర్ద శౌషది స్థాపన (అగ్ని ప్రతిష్ట) దేవీదేవత నవగ్రహ అష్టదిక్పాలక కలశ స్థాపన, దీక్షా హెూమం తదితర కార్యక్రమములు ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ పుట్టా లక్ష్మీ సుబ్రహ్మణ్యం నాయుడు దంపతులు, దేవస్థాన సహాయ కమీషనర్ కార్యనిర్వహణాధికారి డబ్బుగుంట వెంకటేశ్వర్లు, పాలక మండలి సభ్యులు తిరువాయిపాటి నందకుమార్, గుమ్మా రఘురామయ్య, ముంగర శివ కుమార్ తిరుమూరు సుప్రజ, ఆములూరు విమల, బట్టేపాటి విజయమ్మ, గుంటూరు కామేశ్వరి, కాగొల్లు పద్మ, ఎక్స్ అఫీసీఓ సభ్యులు శ్రీశైలం శశి శేఖర్ శర్మ, ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

గ్రంథాలయ వేసవి విజ్ఞాన శిక్షణలో ఆటల పోటీలు

విశాలాంధ్ర-రాపూరు:రాపూరులోని గ్రంథాలయంలో 35 రోజుల పాటు జరుగుతున్న వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరంలో మూడవరోజు, నాల్గవరోజు గ్రంథాలయ అధికారి జె.ధనమ్మ విద్యార్థు లకు, పిల్లలకు మూడవ రోజు బుధవారం పుస్తక సమీక్ష గురించి వివరించారు. నాల్గవ రోజు గురువారం విద్యార్థులకు లెమన్ స్పూన్ అటల పోటీలను నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను గ్రంథాలయ ఇంచార్జి అధికారి ధనమ్మ అందించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు కె.వేంకటేశ్వర్లు, విద్యార్థులు, పిల్లలు, పాఠకులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర -పలేటివారిపాలెం: మండలంలోని చుండి గ్రామంలోని ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల9వ తేదీ నుంచి 25వ తేదీ లోపు ఆన్‌లైను ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ గుర్తింపు కలిగిన పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే అర్హులు అని అన్నారు. ఓ.సీ, బీసీ అభ్యర్థులు 1-9-2011నుండి 31-8-2013 మధ్య జన్మించి ఉండాలని, ఫీజు150 రూపాయలు అని, యస్‌సీ, యస్‌టీ విద్యార్థులు (1-9-2009 నుండి 31-8-2013)మధ్య జన్మించి ఉండాలని ఫీజు 75 రూపాయలు దరఖాస్తు ఫీజు ఈ -సేవా, ఏపీ ఆన్ లైన్ ద్వారా చెల్లించి ఏదైనా ఇంటర్నెట్ సెంటర్‌లో దరఖాస్తు చేసుకొని ఆ దరఖాస్తు తో పాటు ఆధార్,రేషన్ కార్డు,ఫొటో, స్టడీ సర్టిఫికెట్ జెరాక్స్ కాపీలను పాఠశాలలో ప్రిన్సిపాల్‌కు అందజేయాలని తెలిపారు. జూన్11వ తేదీన పరీక్ష నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేస్తామని తెలిపారు. ఇతర వివరా లకు పాఠశాలల్లో సంప్రదించాలని ఆయన సూచించారు.

ఇసుక అక్రమ రవాణాన్ని అడ్డుకోవాలి: జనసేన

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: ఇసుక అక్రమ రవాణాన్ని అడ్డుకోవాలంటూ జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ జిల్లా ఉపాధ్యక్షులు సుధీర్ బద్దిపూడి తమ కార్యవర్గంతో తహశీల్దారుకి మైనింగ్ డిపార్ట్మెంట్ కి జలవనరుల శాఖ ఎస్సీ కి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోవూరు నియోజక వర్గంలో ఒక వైపు నుంచి గ్రావెలు మరోవైపు నుంచి ఇసుక అక్రమంగా కిలోమీటర్ల మేర 30 అడుగులలో పైబడి అక్రమంగా కోట్లాది రూపాయల సంపద అక్రమ రవాణా జరుగుతుంది. రానున్న తర్వాత ఒక గంపడు గ్రావెల్ ఇసుక దొరికే పరిస్థితి ఉండదేమో అనిపిస్తోందన్నారు. వైసీపీ నాయకులకు తలొగ్గి పనిచేస్తున్న అధికారులు అందరికీ ఒకటే చెబుతున్నా ఈ ప్రభుత్వం ఎనిమిది నెలలకు మించి నిలబడదని, రానున్న ప్రభుత్వాలకి మీరు సమాధానం చెప్పవలసి వస్తుందన్నారు. వారి అక్రమ సంపాదనకు మీరు సాక్షు లుగా నిలవద్దు. ఈ రోజు ఉదయం జమ్మిపాలెం వద్ద అధికారులు తనిఖీ చేసే గంట వదిలేసి యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా కొనసాగుతోందని, ఈ విషయమై జల వనరుల శాఖ ఎస్సీని ఎమ్మార్వోని మైనింగ్ డిపార్ట్మెంట్‌ని సంప్రదించారు. ఒకసారి ఆ ప్రాంతాన్ని సందర్శించి ఇది ప్రజా ఉపయోగాలు కోసం సేకరించిందా? లేదా అక్రమంగా తరలిపోతుందా? విచారణ చేపట్టి దోషులను శిక్షించాల్సిన పరిస్థితి ఉందని తెలిపారు. సరైన అనుమతులు చూపకుండా జగన్ ఇళ్లకు తోలుతున్నామని చెప్పినా.. ఆయా ప్రదేశాల్లో ఇసుక అవసరత లేకపోయినప్పటికీ రోజూ లెక్క లేనన్ని ట్రాక్టర్ల తో అక్రమ రవాణా వల్ల స్థానికులకు ఇసుక గ్రావెల్ అందని పరిస్థితి సామాన్యుడు ఇల్లు కట్టుకోవాలన్నా వాళ్ల అవసరాలకి గ్రావెల్ ఇసుక దొరికే పరిస్థితి లేదని, మాఫియా మహమ్మారిని వీలైనంత త్వరగా కట్టడి చేయాలని లేకుంటే జనసేన తరపున ఆందోళన చేపట్టి కోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చూడటమే కాకుండా రేపు మాపో వచ్చే వరదల నుంచి కూడా గ్రామాల కాపాడాల్సిన అవసరంను తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ ఉపాధ్యక్షులు సుదీర్ బద్దపూడి, జిల్లా కార్యదర్శి ప్రశాంత్ గౌడ్,సిటీ కార్యదర్శి హేమచంద్ర యాదవ్, సిటీ నాయకులు షాజహాన్ పాల్గొన్నారు.



14న హనుమాన్ జయంతికి చురుగ్గా ఏర్పాట్లు

విశాలాంధ్ర- నెల్లూరు: నెల్లూరు జిల్లా వరికుంటపాడు మండలం విరువూరు గ్రామంలో శ్రీకృష్ణదేవ రాయల కాలంలో ప్రతిష్ఠించిన ప్రసన్నాంజనేయ స్వామి సన్నిధిలో ఈనెల 14న ఆదివారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తామని దేవస్థాన కమిటీ సభ్యులు భక్తులు తెలిపారు. ఆరోజున స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు జరుగుతాయని, భక్తు లందరికీ అన్న ప్రసాదం ఉంటుందని వారు తెలిపారు.

అధికారులతో మంత్రి కాకాణి సమీక్ష

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: వ్యవసాయ, ఉద్యానవన, మార్కెటింగ్ శాఖలపై సమీక్ష నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయం సహకార, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖా మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, సమీక్షకు హాజరైన వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది, సహకార మార్కెటింగ్ శాఖ ప్రధాన కార్యదర్శి చిరంజీవి చౌదరి, వ్యవసాయ శాఖ కమీషనర్ హరికిరణ్, ఉద్యానవన శాఖ కమిషనర్ శ్రీధర్ మార్కెటింగ్ శాఖ కమీషనర్ రాహుల్ పాండే , ఏపీ సీడ్స్ మేనేజింగ్ డైరెక్టర్ శేఖర్ బాబు , ఏపీ ఆగ్రోస్ మేనేజింగ్ డైరెక్టర్ కృష్ణమూర్తి ఇతర సీనియర్ అధికారులు, అకాల వర్షాలకు జరిగిన పంటల నష్టాల అంచన, నష్టపరిహారం అందించేందుకు చర్యలు, రైతులు పండించిన మొక్కజొన్న తదితర పంటలకు గిట్టుబాటు ధర కల్పించడం, రైతులకు సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు ఆర్బికేల ద్వారా అందించడం, తదితర అంశాలపై మంత్రి కాకాణి సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. అకాల వర్షాలకు నష్టపోయిన రైతాంగం పట్ల అంచనాలు తయారు చేయడంలో గానీ, నష్టపరిహారం అందించడంలో గానీ, ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్ రెడ్డి ఆదేశాల నుసారం ఉదారం గా వ్యవహరించేందుకు కింది స్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని సీనియర్ అధికారులను మంత్రి కోరారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో రాజీ పడకుండా మొక్కజొన్న కొనుగోలు చేయడంతో పాటు, గిట్టుబాటు ధర లభించని ఇతర పంటలను

గుర్తించి, కొనుగోళ్లు చేపట్టాలని మంత్రి సూచించారు. ఖరీఫ్ సీజన్ కు సంబంధించి, సబ్సిడీ విత్తనాలు అందించేందుకు ఖరారు చేసిన యాక్షన్ ప్లాన్ ను మంత్రి కాకాణి సమీక్షించారు. ఖరీఫ్ సీజన్ కు సంబంధించి, అవసరమైన ఎరువులు, పురుగు మందులు ఆర్బికేలలో నిల్వ చేసుకునేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని మంత్రి అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాలనుసారం రైతాంగానికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు అధికార యంత్రంగం ఎల్లవేళలా సిద్ధంగా ఉండాలన్న మంత్రి కాకాణి సూచించారు.

లష్కర్లు ధర్నాకు మద్దతు: సీపీఐ

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: 25 నెలల పెండింగ్ జీతాలు ఇవ్వాలంటూ ఇరిగేషన్ ఆఫీస్ వద్ద లష్కర్లు ధర్నా చేపట్టారు. ఈ ధర్నాకు సిపిఐ మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సయ్యద్ సిరాజ్, షానవాజ్ మాట్లాడుతూ ఇరిగేషన్ శాఖలో పనిచేస్తున్న లష్కర్లకు దాదాపు 25 నెలల నుండి జీతాలు పెండింగ్‌లో వున్నాయి. దీనికి కారుకులు ఇరిగేషన్ అధికారులు ఈఈ నిర్లక్ష్యం వల్ల జీతాలు రావడం లేదని లష్కర్లు తెలిపారన్నారు. దాదాపు 223 మంది లష్కర్ల జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని, 25 నెలల నుండి ఇంత మందికి జీతాలు ఇవ్వకుండా ఆపేయడం దారుణం అన్నారు. వీళ్ల ఎలా బతకాలి? ఇదే కొనసాగితే ఈ లష్కర్ల కుటుంబాలు రోడ్ల పాలవుతాయని కనీసం మానవత్వం ఉండాలని, ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ జీతాలను లష్కర్లకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో సీపీఐ నాయకులు, గంగపట్నం రమణయ్య, అహ్మద్, ఇరిగేషన్ శాఖ లష్కర్లు శ్రీనివాసులు, రామ్మోహన్, చంద్రకుమార్, బాదుల్లా, సందాని, అలీ భాష, హుసల్ పాల్గొన్నారు.

జోరుగా ఉపాధి పనులు

విశాలాంధ్ర- వలేటివారిపాలెం: మండలంలోని కొండ సముద్రం పంచాయతీలో వర్క్ ఐ డి 884857 తూర్పు వాగు, వర్క్ ఐడి 884728 ఉప్పుకుంటలో జోరుగా ఉపాధి హామీ పనులు జరుగుతున్నాయి. గ్రామ సర్పంచ్ మన్నం వెంగమ్మ, వైసీపీ నాయకుడు మన్నం వెంకట రమేష్ పంచాయతీలోని ఉపాధి కూలీ లకు ఉపాధి హామీ పనులపై అవగాహన కల్పిస్తూ ఏ ఒక్క ఉపాధి హామీ కూలి ఇతర ప్రాంతాలకు వలస పోకుండా స్థానికంగానే ఉపాధి అవకాశాలు సద్వినియోగం చేసు కోవాలన్నారు. దీంతో గ్రామ పంచాయతీలో జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఉపాధి పనికి వెళ్లి జీవనోపాధి పొందుతున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ నరసింహం పనులకు తీసుకెళ్లి కూలీలతో పనులు చేయిస్తున్నారు.

ఘనంగా కానిస్టేబుల్ సత్యం వర్ధంతి

విశాలాంధ్ర -జలదంకి: హ్యాపీ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా ఐ.డి. పార్టీ హెడ్ కానిస్టేబుల్ రామగిరి సత్య నారాయణ (పోలీస్ సత్యం)ద్వితీయ వర్ధంతి సందర్భంగా జలదంకి గ్రామం లోని గౌరవరం మేజర్ కాలువ కట్ట గిరిజనులకు చికెన్ బిరియాని , పాకెట్స్ హ్యాపీ సేవా సంస్థ ఆధ్వర్యంలో అధ్యక్షులు సయ్యద్ ఘనీబాషా అందజేశారు. ముందు రామగిరి సత్యనారాయణ చిత్రపటానికి గిరిజనుల సమక్షంలో పూలమాల వేసి ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఘనంగా నివాళి అర్పించి అనంతరం బిరియాని పాకెట్స్ అందించారు. వారు మాట్లాడుతూ డ్యూటీలో అంకిత భావం తో పనిచేయడం, పేదప్రజలకు తనవంతు సహాయ సహకారాలు అందించడం ఎంతో అభినందనీయం అని, విధినిర్వహణ లో కరోనా మహమ్మారికి చనిపోవడం చాలా బాధాకరమన్నారు. ఈ కార్యక్రమం లో హ్యాపీ సేవా సంస్థ అధ్యక్షులు సయ్యద్ ఘనీబాషా, రామగిరి అనుదీప్, సయ్యద్ హఫీజ్ అలీ, దేవరకొండ విజయ్, చేవూరి ప్రబయ్య పాల్గొన్నారు.

బెట్టింగ్ అనిల్ కుమార్ యాదవ్ రౌడీ పనులు మానుకోవాలి: జనసేన

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: నెల్లూరు సిటీ నియోజకవర్గ జనసేన ముఖ్య నాయకులు కేతంరెడ్డి వినోద్ రెడ్డి గారిపై వైసీపీ రౌడీ మూకల దాడిని ఖండిస్తూ జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు ఆదేశాల మేరకు నెల్లూరు సిటీ జనసేన కార్యాలయంలో నేడు జిల్లా చిరంజీవి యువత సీనియర్ నాయకులు ఏటూరి రవి, కారంపూడి కృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్షులు మార్కెట్ సురేష్, పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ జిల్లా అధ్యక్షులు హరిరెడ్డి, జనసేన ఆత్మకూరు ఇన్ ఛార్జ్ నలిశెట్టి శ్రీధర్, సర్వేపల్లి నాయకులు బొబ్బేపల్లి సురేష్ నాయుడు ప్రెస్ మీట్ నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెల్లూరు సిటీలో కనీస అభివృద్ధిని కూడా చేయలేక నియోజకవర్గాన్ని గాలికి వదిలేసిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే అనిల్ కుమార్ యాదవ్ తన వైఫల్యాలను, చేతగానితాన్ని ప్రశ్నించిన వారిపై భౌతిక దాడులకు రౌడీ మూకలను ఉసిగొల్పడం సిగ్గు మాలిన చర్య అని అన్నారు. ఎమ్మెల్యే అనిల్ కు నిబద్ధత ఉంటే తాము ప్రశ్నించే అంశాల పనుల ప్రారంభానికి పూనుకోవాలి కానీ ఇలా పిరికిపందలా పిచ్చి పనులు చేయకూడదని అన్నారు. పవన్ కళ్యాణ్ సూచనల మేరకు తాము ఆవేశాన్ని అణచుకుంటూ శాంతి యుతంగా కార్యక్రమాలు చేస్తున్నామని, కానీ కేతంరెడ్డి వినోద్ రెడ్డిపై నిన్న వైసీపీ రౌడీ మూకల దాడి జరిగిన వెంటనే తమ ప్రతిస్పందన ఎలా ఉందో జిల్లా మొత్తం ప్రజలు చూశారని, ఇది శాంపిల్ మాత్రమే అని, మరోసారి ఇటువంటి పిచ్చి పిరికిపంద చర్యలకు పాల్పడితే ఇంతకు వంద రెట్ల ప్రతిస్పందన చూడాల్సి వస్తుందని హెచ్చరించారు. బెట్టింగ్ వంటి అంశాల్లో ఆరితేరిన ఎమ్మెల్యే అనిల్ కుమార్ యాదవ్ కి అంత ప్రిస్టేజీ ఉంటే నగర అభివృద్ధి మీద ఆ ప్రిస్టేజీని చూపాలి కానీ, ఇలాంటి పనికిమాలిన పనుల మీద కాదని అన్నారు. ఎంతో ప్రశాంతమైన రాజకీయాలకు పేరు గాంచిన నెల్లూరు జిల్లాలో రౌడీ మూకలతో అల్లర్లు చేయిస్తున్న ఎమ్మెల్యే అనిల్ కుమార్ యాదవ్ వ్యవహారం చూస్తుంటే ఎంత అభద్రతాభావంలో కొట్టుమిట్టాడుతున్నారో తెలుస్తోందని, మరొక్కసారి మా నాయకులపై దాడులు చేయాలనే ఆలోచన వచ్చినా సరే తీవ్ర పరిణామాలను ఎమ్మెల్యే అనిల్ కుమార్ యాదవ్ ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

ఇసుక అక్రమ రవాణా ట్రాక్టర్లు పట్టివేత

విశాలాంధ్ర-లింగసముద్రం : మండల పరిధిలోని అన్నే బోయినపల్లి గ్రామ సమీపంలో గల మన్నేరు వాగు నుండి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఎస్ఐ ఆవుల వెంకటేశ్వర్లు గురువారం కాపు కాసి పట్టుకున్నారు. వలేటివారిపాలెం మండలానికి చెందిన గుత్తా ఆంజనేయులు జెడ్ ఉప్పలపాడు గ్రామానికి చెందిన నర్రా బాలయులు ఇసుక తరలిస్తున్న క్రమంలో అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో ఇసుక మట్టి ఎవరు అక్రమంగా తరలించిన చర్యలు కచ్చితంగా ఉంటాయని కేసులు నమోదు చేసి జైలు పంపుతామని హెచ్చరించారు.

టిడిపి నాయకుల ఇంటిగ్రేటెడ్ శిక్షణ

విశాలాంధ్ర-రాపూరు: రాపూ రులోని షాదిమంజిల్ లో టిడిపి మాజీ శాసనసభ్య లు, వెంకటగిరి నియోజకవర్గ ఇంచార్జ్ కురుగొండ్ల రామకృష్ణ అధ్యక్షతన రాపూరు మండలం , సైదాపురం మండలం, కలువాయి మండలాల క్లస్టర్ ఇంచార్జీలతో, యూనిట్ ఇంచార్జీలతో, బూత్ కన్వీనర్లతో, ఐటిడిపి కోఆర్డినేటర్ లతో, మండలాల నాయకులతో ఇంటిగ్రేటెడ్ శిక్షణను రాపూరు మండల అధ్యక్షులు దందొలు వేంకటేశ్వర రెడ్డి, తిరుపతి పార్లమెంటు జిల్లా మైనారిటీ ఉపాధ్యక్షులు, రాపూరు పట్టణాధ్యక్షులు షేక్ ముక్తార్, తిరుపతి పార్లమెంట్ అధికారి ప్రతినిధి నువ్వుల శివ రామకృష్ణ, తిరుప తి పార్లమెంట్ ఉపాధ్యక్షులు కొండ్లపొడి రాఘవరెడ్డి ల ఆధ్వర్యంలో ఇంటి గ్రేటెడ్ శిక్షణ నిర్వహించారు. ఈ శిక్షణలో సైదాపురం, కలువాయి మండలాల మండల అధ్యక్షులు, పట్టణా ధ్యక్షులు, ఐటిడిపి ఘట్టమనేని రమణయ్య, తెలుగు యువత ఉపాధ్య క్షులు షేక్ అహమ్మద్, పట్టణ ఉపాధ్యక్షులు గజర వేణు గోపాల్, మండ ల ప్రధాన కార్యదర్శి తూమాటి పెంచలయ్య, సంకల పాపయ్య సిహెచ్ మహేష్, మైనార్టీ అధ్యక్షులు గౌస్ బాష, కె.బాలయ్య షేక్ లతీఫ్, షేక్ అంజద్, షేక్ షాజహాన్, షేక్ షాకీర్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రశాంతి కాలనీలో సీపీఐ జెండా ఆవిష్కరణ

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: పట్టణ పరిధిలోని ప్రశాంతి కాలనీలో సిపిఐ జెండా ఆవిష్క రించి పేద వర్గాల నినాదాల మధ్య అత్యంత ఘనంగా గురు వారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బి సురేష్ బాబు జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ భారత సమాజంలో ఎన్ని రాజకీయ పార్టీలున్న నేటికి పేద బలహీన వర్గాలు కార్మిక కర్షక మహిళ యువత సమస్యల పరిష్కారం కోసం ముందుండి ఉద్యమిస్తూ అండదండలు అందిస్తున్న ఏకైక పార్టీ సిపిఐ అని కొనియాడారు. ప్రస్తుతం దేశంలో మతోన్మాద రాజకీయాల్లో కేంద్ర ప్రభుత్వం రాజకీయాని వాడుకుంటూ లబ్ది పొందిన బిజెపిని పేద వర్గాలు భగ్నం చేయాలని పిలుపు ఇచ్చారు. కార్మికులకు ఉపాధినీ నాశనం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ సెక్టారును ప్రైవేటుపరం చేస్తోందని దీన్ని ప్రతి ఒక్కరు అడ్డుకోవాలన్నారు. ఇలాంటి తరుణంలో ప్రతి సిపిఐ కార్యకర్త ప్రజల కోసం ప్రజల సమస్యల పరిష్కారం కోసం సమాజంలో జరుగుతున్న హత్యలు, అత్యాచారాలు, దోపిడి , దుర్మార్గాలను, దౌర్జన్యాలను ముందుండి ఎదుర్కోవాలను కోవ దం సిపిఐ కార్యకర్త బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు నత్తరామారావు సింగయ్య, మధు, పాండు, మహేష్,మోష్ పాల్గొన్నారు.

భారత్ నెంబర్ 2 - మిక్స్ బాక్సింగ్ లో శివకుమార్ ప్రతిభ

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: వరల్డ్ మిక్స్ బాక్సింగ్ లో భారతదేశం రెండో స్థానంలో నిలిచింది. అదీ నెల్లూరీయుడు శివకుమార్ ప్రతిభ చూపుడంతో భారత్ కు ఈ గౌరవం దక్కింది. ఇటీవల జమ్మూ కాశ్మీర్లో నిర్వహించిన వరల్డ్ రెండవ మిక్స్ బాక్సింగ్ ఛాంపియన్షిప్ పోటీలు జరి గాయి. ఈ పోటీలలో భారత్ తో సహా, 18 దేశాలు పాల్గొన్నాయి. భార త్ తరపున నెల్లూరు జిల్లా ఇందుకూరుపేట మండల వాసి శివకుమార్ ఈ పోటీల్లో పాల్గొని, రెండోవ స్థానంలో నిలిచారు. దీంతో పలువురు ప్రముఖులు ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ వరల్డ్ కప్ పోటీలలో శ్రీలంక మొదటి స్థానం సాధించగా, భారత్ రెండో స్థానం, నేపాల్ మూడో స్థానంలో నిలిచాయి.

నేడు మండల పరిషత్ సమావేశం

విశాలాంధ్ర-ముత్తుకూరు: మండల పరిషత్ సాధారణ సమావేశం ఈనెల 12 మధ్యాహ్నం రెండు గంటలకు జరుగుతుందని ఎంపీడీవో ప్రత్యక్ష తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి జిల్లాలోని కావలికి వస్తున్నందున మండలంలోని ఎంపీటీసీ, సర్పంచులు ముఖ్యమంత్రి సభకు వెళు తున్నామని అందువల్ల మార్పు చేయాలని సభ్యులు కోరినందున ఉదయం 11 గంటలకు జరగాల్సిన సమావేశాన్ని మధ్యాహ్నం రెండు గంటలకు జరిగేలా మార్పు చేసినట్టు ఆమె తెలిపారు.

సచివాలయాల ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర- నెల్లూరు కార్పొరేషన్: నగర పాలక సంస్థ పరిధిలోని స్థానిక 38/2 శోధన్ నగర్, 36/1 బ్రహ్మానంద పురం, 46/1 దండువారి వీధి, 46/3 బృందావనం వార్డు సచివాలయాలను కమిషనర్ వికాస్ మర్మత్ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయాలలోని ఇన్స్పెక్షన్ రిజిష్టరు, నోటీసు బోర్డు, హాజరు రిజిస్టరు, స్పందన రిజిష్టరులతో పాటు వివిధ సంక్షేమ పథకాల రికార్డులను పరిశీలించారు. పెండింగులో ఉన్న సేవలను గడువులోపు పూర్తి చేయాలని, సాంకేతిక అంశాలపై నేరుగా సూచనలు పొందాలని కార్యదర్శులకు కమిషనర్ సూచించారు. ఎస్.డి.జి సర్వే, భూహక్కు సర్వే, ఎ.పి సేవా పోర్టల్ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి సూచించిన యాక్షన్ ప్లాన్ ను అమలు చేయాలని తెలిపారు. ఆస్తి పన్ను, యూజర్ చార్జీల వసూళ్ళను సచివాలయ కార్యదర్శులు వేగవంతం చేయాలని సూచించారు. ప్రజలకు అందించే సేవల్లో నిబద్ధత పాటించాలని, తమకు నిర్దేశించిన పన్నుల వసూళ్ల లక్ష్యాలను గడువులోపు అందుకోవాలని సూచించారు. జగనన్న కాలనీలే అవుట్ల నిర్మాణం పనులను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు. అనంతరం స్థానిక కె.వి.ఆర్ కూడలి సమీపంలోని హెూటల్ అతిథి, కస్తూరి దేవి గార్డెన్స్, రవీంద్ర నాథ్ ఠాగూర్ కళ్యాణ మండపాలను సందర్శించిన కమిషనర్ యూజర్ చార్జెస్ ను వెంటనే చెల్లించాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం స్పందన ఫిర్యాదుల ప్రత్యక్ష పరిశీలనలో భాగంగా స్థానిక ఇస్కాన్ సిటీ, రిత్విక్ ఎంక్లేవ్ ప్రాంతాలలోని సమస్యలను కమిషనర్ తనిఖీ చేసి పరిష్కారానికి అధికారులకు వివిధ సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ ఇంజనీరింగ్, శానిటేషన్, టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రంథాలయ వేసవి విజ్ఞాన శిక్షణలో పుస్తక సమీక్ష

విశాలాంధ్ర-రాపూరు: రాపూరులోని గ్రంథాలయం లో 35 రోజుల పాటు జరుగు తున్న వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరంలో మూడవ రోజు గ్రంథాలయ అధికారి జె.ధనమ్మ విద్యార్థు లకు, పిల్లలకు పుస్తక సమీక్ష గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు కె.వెంకటేశ్వర్లు, విద్యార్థులు, పిల్లలు పాఠకులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమించి తరగతులు నిర్వహిస్తున్న జూనియర్ కళాశాలపై చర్యలు తీసుకోవాలి: ఏఐఎస్‌బి

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: నెల్లూరు నగరంలో ఉన్న ప్రైవేట్ కార్పొరేట్ జూనియర్ కళాశాలలు ప్రభుత్వ నిబంధనలు ప్రభుత్వ సెలవు దినాలైన వేసవి సెలవుల్లో విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నారని వెంటనే తరగతు లు నిర్వహిస్తున్న కళాశాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆల్ ఇండియా స్టూడెంట్ బ్లాక్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా ఆర్ ఐ ఓ వరప్రసాద్ వినతి పత్రం అందించారు.ఈ సందర్భంగా చైతన్య ఫెయిల్ అయిన విద్యార్థులు, ఇంప్రూవ్‌మెంట్లు సాకుతో విద్యార్థులకు మానసిక ప్రశాంతత లేకుం డా బట్టీ చదువులు చదివిస్తూ విద్యార్థులను మానసికంగా వేధిస్తున్నారని ఆయన వాపోయారు. నెల్లూరు నగరంలోని ఆర్ఎస్ఆర్, వశిష్ట,యస్ ఆర్, శ్రీ చైతన్య, నారాయణ, విశ్వ సాయి జూనియర్ కళాశాలలు విచ్చలవిడిగా విద్యార్థులను బంధించి సెకండ్ ఇయర్ తరగతులు నిర్వహిస్తున్నారని విద్యను వ్యాపారంల తయారుచేసి ఫీజుల దోపిడీని కొనసాగిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.. వేసవి సెలవు దినాలలో తరగతులు నిర్వహించకూడదని ఆదేశాలు ఉన్నప్పటికీ యదేచ్ఛగా ప్రభుత్వం ఉల్లంఘి స్తున్నారని జిల్లా విద్యాశాఖ అధికారులు మాత్రం పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆయన వాపోయారు. జిల్లా ఆర్ఐవో జోక్యం చేసుకొని వెంటనే తరగతులు నిర్వహిస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకుని గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో జిల్లా కార్యదర్శి రాఖీ, సిటీ ఇంచార్జి సోను, రాజీవ్, రాంతుల్లా పాల్గొన్నారు.

జగనన్నకు చెబుదాం" కార్యక్రమాలను ప్రవేశ పెడుతున్న ముఖ్యమంత్రి

మంత్రి కాకాణి

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: ప్రభుత్వ సేవలు, సంక్షేమ కార్యక్రమాలకు సం బం ధించి ప్రజలకు ఎదురయ్యే సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు " జగన న్న కు చెబుదాం" లాంటి వినూత్నమైన కార్యక్రమాలను ప్రవేశ పెడు తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కి దక్కుతుందని రాష్ట్ర వ్యవసాయ, సహకా ర, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం సాయంత్రం సర్వేపల్లి నియోజకవర్గం, వెంకటాచలం మండలం, అనికేపల్లి గ్రామంలో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొ న్న మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డికి స్థానిక ప్రజలు ఘన స్వాగతం పలికారు. మంత్రి ప్రతి ఇంటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గురించి వివరిస్తూ, వారి సమస్యలు తెలుసుకుంటూ, వివిధ పథకాల కింద వారు పొందుతున్న లబ్ధి సమాచారంతో కూడిన బుక్ లెట్‌ను అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి గోవర్ధన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, అన్నీ వర్గాల ప్రజల సంక్షేమం గురించి ఆలోచన చేస్తున్న వైఎస్. జగన్మోహన్ రెడ్డి రాష్ట్రానికి ముఖ్యమంత్రి గా ఉండటం రాష్ట్ర ప్రజల అదృష్టమన్నారు. ప్రభుత్వ సేవలు, సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రజలకు ఎదురయ్యే సమస్యలను సత్వరం పరిష్కరిం చేందుకు జగనన్నను చెబుదాం కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టడం జరిగిందని, రాష్ట్ర చరిత్రలో ఇలాంటి వినూత్నమైన కార్యక్రమాలను చేపట్టిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కి దక్కుతుంద న్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అపరిష్కృతంగా ఉన్న చుక్కల భూముల సమస్యను పరిష్కరిస్తూ రేపు కావలి పట్టణంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా రైతులకు పట్టాదారుపాసు పుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు మంత్రి కాకాణి తెలిపారు. చుక్కల భూముల సమస్య పరిష్కారంతో రాష్ట్ర వ్యాప్తంగా రైతులు తమ హర్షాన్ని వ్యక్తం చేస్తున్నారని మంత్రి తెలిపారు. ఈ అనికేపల్లి పంచాయతీ పరిధిలో సుమారు 12.13 కోట్ల రూపాయలతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టినట్లు మంత్రి తెలిపారు. మంత్రి వెంట వివిధ శాఖల మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్సీపీ నాయకు లు, ప్రజలు పాల్గొన్నారు.

దోచుకోవడం..దాచుకోవడం తరహాలో వైసీపీ పాలన

- ప్రభుత్వం పై భరత్ కుమార్ యాదవ్ ధ్వజం

విశాలాంధ్ర-నెల్లూరు సిటీ: రాష్ట్రంలో వైసిపి పాలన దోచుకోవడం..దాచుకోవడం అన్న తరహాలో ఉందని, బిజెపి జిల్లా అధ్యక్షులు భరత్ కుమార్ యాదవ్ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. స్థానిక బిజెపి జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి పాలన విధానాలను గ్రామస్థాయి నుంచి ప్రజల వద్ద ఎండగడతామన్నారు. వైసిపి ప్రభుత్వం పాలనతో రాష్ట్రంలో అవినీతి పెరిగిపోయిందని తీవ్రస్థాయిలో ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. ఇప్పటివరకు అమ్మవడి నిధులను విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ నాయకుల అవినీతి పై ప్రజల వద్ద ఆధారాలను సేకరించి చార్జిషీట్ దాఖలు చేసేలా అధికారుల దృష్టికి తీసుకు వెళ్తామని అన్నారు. గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను జగన్ మరిచారని విమర్శించారు. ముఖ్యంగా నెల్లూరు జిల్లాకు వైసీపీ ప్రభుత్వం అభివృద్ధి చేసిందేమీ లేదని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించక తప్పదని అన్నారు. ఈ సమావేశంలో బిజెపి జిల్లా ఇంచార్జ్ రఘురాం రెడ్డి, నాయకులు లలితారం, శ్రీనివాస్, జయశ్రీ పాల్గొన్నారు.

జగనన్న కాలని లెవెలింగ్ పనులను పై ఎపిడి విచారణ

విశాలాంధ్ర- కలువాయి :మండలంలోని 20 పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ ద్వారా జరిగిన జగనన్న కాలని లెవెలింగ్ పనుల్లో అప్పటి ఉపాధి హామీ సిబ్బంది,ఎంపిడిఓ చేతివాటం ప్రదర్శించి అక్రమాలు అవినీతికి పాల్పడినట్లు కలువాయి జెడ్పీటీసీ అనిల్ కుమార్ రెడ్డి జెడ్పీ కార్యాలయం నందు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో క్లస్టర్ ఏపీడీ శ్రీహరి గురువారం విచారణ చేపట్టారు.లెవెలింగ్ పనులు చేసి 3 సంవత్సరాలు పూర్తి అవుతున్న బిల్లులు చెల్లించక పోవటానికి అపట్లో పని చేసిన ఉపాధి హామీ సిబ్బంది చేతివాటం వలనే వీరితో అప్పటి ఎంపిడిఓ శింగయ్య, ఈసీ సాంబయ్య, టిఏ నరసింహారెడ్డి ల పై ఫిర్యాదు పై పూర్తి స్థాయి విచారణ త్వరగా చేపట్టి పిడి కి నివేదిక ఇస్తామని ఆయన తెలిపారు. అయితే జగనన్న కాలని లెవెలింగ్ పనులు చేసిన వారికి నేటికీ బిల్లు లు రాకపోవడం గమనార్హం.

ఘనంగా అబ్దుల్ అజీజ్ జన్మదిన వేడుకలు

- వెల్లువలా వచ్చిన పసుపు సైనికులు ఉత్సాహం
- భారీ గజమాలతో ఘన సత్కారం..సర్వమత ప్రార్థనలు
- వంద కేజీల కేక్ కటింగ్

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: నెల్లూరు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇంఛార్జి అబ్దుల్ అజీజ్ జన్మదినాన్ని పురస్కరించుకొని నగరంలోని జిల్లా టిడిపి కార్యాలయంలో గురువారం ఆయన జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకులకు మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి, అజీజ్ లను భారీ గజమాలతో సత్కరించారు. అనంతరం అబ్దుల్ అజీజ్ కు తెలుగు మహిళలు హారతులు పట్టారు. అనంతరం తిరుమల తిరుపతి దేవస్థానంలో నిత్య సుప్రభాత సేవ చదివే వేదపండితులు, ఫాదర్ జోసెఫ్ ఆయన బృందం, ముస్లిం మత పెద్దలు సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం అబ్దుల్ అజీజ్ నిండు నూరేళ్ల చల్లగా ఉండాలని, ఎన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని కాంక్షిస్తూ వంద కేజీల కేక్‌ను కట్ చేశారు. జిల్లా నలుమూలల నుంచి టీడీపీ, నాయకు లు, కార్యకర్తలు హాజరై అబ్దుల్ అజీజ్ కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ నెల్లూరు జిల్లా అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ జన్మదిన వేడుకలు జిల్లా టీడీపీ కార్యాల యంలో ఘనంగా నిర్వహించారని సర్వ మతాల నుంచి మత పెద్దలు వచ్చి ప్రార్థనలు నిర్వహించి ఆశీర్వ దించారని తెలిపారు. అబ్దుల్ అజీజ్ చదువు కున్నవారని విషయ పరిజ్ఞానం ఉన్నవారని అన్ని మతా ల గురించి ఆయనకున్న పరిజ్ఞానం తమకు ఎవరికీ లేదని, ఆయనకు మంచి భవిష్యత్తు ఉండాలని ఆకాంక్షించారు. ఆయన మేయర్ గా ఉన్నప్పుడు కనీవినీ ఎరుగని రీతిలో నగరాన్ని ఎనలేని అభివృద్ధి చేశారని, అది ఒక చరిత్ర అని, ఆ సమయంలో ఎంతో మంచి పేరు తెచ్చుకున్నారని, నగరం ఈరోజు ఇంత సుందరంగా ఉందంటే అది ఆయన చేసిన కృషే అన్నారు. నగరాన్ని టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.5550 కోట్ల తో అప్పటి మంత్రి నారాయణ, మేయర్ అజీజ్ లు అభివృద్ధి చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో చేజర్ల వెంకటేశ్వర రెడ్డి, మేకల నరేంద్ర రెడ్డి, రాజా నాయుడు, సాబీర్ ఖాన్, సురేంద్ర బాబు, యత్రబ్, రమేష్ చౌదరీ, రసూల్, ఆషిక్ అలీ ఖాన్ పాల్గొన్నారు.

కరోనా స్కీంలో స్కాంకి పాల్పడిన వాళ్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి : డివైఎఫ్ఐ

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: బాలాజీ నగర్ డాక్టర్ రామచంద్ర రెడ్డి భవన్ డీవైఎఫ్ఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎంవి రమణ డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బిపి నరసింహ మాట్లాడుతూ జిల్లాలో ఇందుకూరుపేట మండలం సచివాలయం ఒకటిలో సచివాలయం సిబ్బంది సచివాలయం పోలీస్ విజయలక్ష్మి ఇందులో ప్రధాన సూత్రధారిగా ఉన్నారని తెలిసింది. జరిగిన కరోనా స్కీములో స్కాంకు పాల్పడ్డ వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని జిల్లాలో కరోనాతో అనేకమంది కుటుంబాలు రోడ్డున పడ్డ పరిస్థితి అందరికి తెలిసిందే కుటుంబానికి పెద్ద దిక్కు అయినా తండ్రి లేదా తల్లిని కోల్పోయిన కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన స్కీం లో కరోనా బారిన పడ్డ ప్రజలకు 1,50,000 నుంచి 2 లక్షల వరకు ఆర్థిక సహాయం చేయాలని నిర్ణయించింది కానీ ఈ విషయం ఎవరికీ తెలియకుండా యాపిల్ చేసి అధికారులు హాస్పటల్స్ ఇన్సూరెన్స్ కంపెనీలు జిల్లా హెల్త్ ఆఫీసర్లు అందరూ కలిసి ఈ స్కీంలో పాల్పడినట్టు తెలుస్తుంది కరోనా రాకుండానే కరోనా వచ్చినట్టు పాజిటివ్ సర్టిఫికెట్లు హాస్పటల్ అడ్మిట్ అయినట్టు సర్టిఫికెట్లు సృష్టించి ఇన్సూరెన్స్ అధికారులను కలుపుకొని ఈ స్కీమ్లో జిల్లా మొత్తం నిండా కోట్ల రూపాయలు కుంభకోణాలు జరిగినట్టు తెలుస్తుంది కనుక జిల్లా అధికారులు స్పందించి కమిటీ వేసి సమగ్ర విచారణ జరిపి సంబంధిత అధికారులపై క్రిములు కేసు నమోదు చేయాలని సహకరించిన హాస్పిటల్స్ ను సీజ్ చేసి డాక్టర్ లైసెన్స్ రద్దు చేయాలని అన్నారు ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు కుమార్, జగదీష్, నరేంద్ర పాల్గొన్నారు.